
# కామేశం సెల్లు పురాణం



## సెల్లు కష్టాలతో నవ్వించే కథ

### ఆదుర్తి బాల

"ఏమిటోయ్ కామేశం- నువ్వింకా సెల్ కొనకపోవడమేమిటోయ్. మనిషికి కూడు, గూడు, గుడ్డ ఎంత అవసరమో సెల్‌ఫోను కూడా అంతే అవసరమని నువ్వెప్పుడు తెలుసుకుంటావో ఏమో! అసలు సెల్లులేని ఇల్లు చూపించు చూద్దాం! పాలవాడి నుంచి ప్రైమ్ మినిష్టరు వరకూ సెల్ లేని వాడిని చూశావా- మనం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందామో చేతిలో సెల్లున్నప్పుడే కదా తెలిసేది. ఇంత తెలిసీ నువ్వు సెల్ కొనకపోతే నువ్వు అభివృద్ధి చెందిన వాళ్ళలో లేనట్టే లెక్క" చెవిలో చిన్న సైజు ఉపన్యాసాన్ని దంచాడు అచ్చిబాబు.

"చూడు మిత్రమా మనం ఎలా ఉన్నామన్నది క్వశ్చన్ కాదు. ఎదుటివాడికి ఎలా కనిపిస్తున్నామన్నది పాయింటు. ఫర్ ఎగ్జాంపుల్ నీకు డబ్బున్నంత మాత్రాన సరిపోదు. నువ్వు డబ్బున్నవాడివని ఎదుటి వాడు గుర్తించేటట్టు చేసుకోవాలి. మన అసలు టాలెంటు ఎలా ఉన్నా ఎంతో టాలెంట్ ఉన్నట్టు ప్రజెంట్ చేసుకోవడం ముఖ్యం. సెల్లు చేత్తో పట్టుకొని వీలైనప్పుడల్లా చెవి దగ్గర పెట్టుకుని బిల్డప్ ఇచ్చుకుని చూడు ఆ మజాయే వేరు" ఇంకొక ఫ్రెండు పిచ్చిబాబు కామేశానికి బ్రెయిన్ వాష్ చేశాడు.

అలా మిత్ర బృందంలోని సభ్యులంతా వంతుల వారీగా సెల్‌ఫోను ప్రాముఖ్యత తెలియజేస్తూ - 'ఇంత చెప్పినా సెల్‌ఫోను కొనాలనే ఆలోచన నీకెందుకు రావట్లేదురా వెధవాయ్' అన్న అర్థంతో ఓ లుక్కిచ్చారు కామేశానికి. బుర్ర తిరిగిపోయిన కామేశం తానింక సెల్ కొనకపోతే తులసీవనంలో గంజాయిమొక్కలా మిగిలిపోతానని భయపడి ఆ రోజే ఓ సెల్‌ఫోన్ కొనిపడెయ్యాలని డిసైడైపోయాడు.

ఇక్కడ కామేశం పరిస్థితి ఇలా ఉంటే అతని భార్య సుందరి అనుభవం ఇంకోలా ఉంది. భర్తని ఆఫీసుకి పంపించాక ఇల్లు సర్ది పనిమనిషి బట్టలుతకడం అయిందో లేదోనని పెరట్లోకి తొంగి చూసింది సుందరి. అక్కడ ఉతకాల్సిన బట్టలు ముందేసుకుని సెల్‌ఫోన్ చెవి దగ్గర పెట్టుకుని ముసి ముసిగా నవ్వుతూ మెలికలు తిరిగిపోతోంది రంగి. ఓ పావు గంట అయిన తరువాత సెల్ బొడ్లో దోపుకుని బట్టలు ఉతకడం మొదలుపెట్టింది రంగి.

"ఎవరే మాట్లాడేది అంత మెలికలు తిరిగిపోతూ వింటున్నావు. ఏవిటి సంగతి" ఉండబట్టలేక అడిగేసింది సుందరి.

"ఇంకెవరమ్మా- మా మావ ఫోన్జేసిండు. రాత్రానుఆడికి సరదాలెక్కువౌతున్నాయమ్మా. ఫోన్లో సరసాలు మొదలెట్టిండు. పని తొరగా ముగించుకొస్తే సినిమాకి తీస్కెల్తనన్నాడు" సిగ్గుపడుతూ చెప్పింది రంగి. తన కంటే ఎన్నో రెట్లు కిందిస్థాయిలో ఉన్నా ఆ క్షణంలో రంగిని చూస్తే సుందరికి అసూయ కలిగింది. 'తనకీ ఉన్నాడు ముద్దపప్పు మొగుడు. సెల్‌ఫోన్ కొనమని ఎన్నిసార్లడిగిందో తను - వినిపించుకుంటేగా! పైగా ఇంట్లో ఓ ఫోనుందిగా, మళ్లీ సెల్లెందుకు బిల్లు దండగ అంటాడు. ఏమిటో తన బతుకు. 'ముష్టి మొగుడు' సీరియల్‌లో సెకండ్ హీరోయిన్‌లా కన్నీరు కారుస్తూ బతకాలి తనింక ఈ జన్మకి' నీరసంగా నిట్టూరుస్తూ అనుకుంది సుందరి.

'ఎడారి బతుకు' సీరియల్‌లో అనుకోని మలుపులా కామేశం సెల్‌ఫోన్ చేతబట్టి ఇంట్లో అడుగుపెట్టగానే మొదట ఆశ్చర్యపోయి తరువాత ఆనందించింది సుందరి. భర్త చేతిలోంచే సెల్‌ఫోనందుకుని ముద్దుగా ఒద్దికగా అరచేతిలో ఇమిడిపోయిన సెల్‌ని చూసి "ఎంత బావుందో చిట్టిముండ" అన్నది సుందరి మురిపెంగా.

"పోన్లెండి ఇప్పటికైనా సెల్ కొన్నారు. రోజూ మీరు ఆ బండి వేసుకొని బైటకెడితే తిరిగి ఇంటికి క్షేమంగా వచ్చేవరకు టెన్షనే నాకు. ఇప్పుడా భయం లేదు. మీరెక్కడున్నా మీ సెల్‌కి ఫోన్జేసి క్షేమంగా ఉన్నారో లేదో కనుక్కుంటూండవచ్చు" అన్నది సుందరి.

'నిజమే సుమా' అన్నట్టు తలూపాడు కామేశం.

"అవును సుందూ మన వాళ్ళలో ఎవరికైనా ఇదే కంపెనీ ఫోన్లున్నాయా" అన్నాడు కామేశం.

"మా అమ్మా వాళ్ళ ఫోను ఈ కంపెనీదే. ఇంతకీ ఎందుకడిగారు" అన్నది సుందరి.

"ఏం లేదు ఇదే కంపెనీ ఫోనున్న వాళ్ళతో నెలకి నూటయాభై కాల్స్ వరకూ ఫ్రీగా మాట్లాడుకోవచ్చు. అలా ఓ సంవత్సరం వరకూ అంటే పద్దెనిమిది వందల కాల్స్ ఫ్రీ అన్నమాట. అంటే ఓ సంవత్సరం పోయాక మనకీ ఫోన్ ఫ్రీగా వచ్చినట్టు లెక్క" భార్యకి విడమరచి చెప్పాడు కామేశం.

"అవునా! అబ్బా అన్ని ఫ్రీకాల్స్ ఆఫర్ చేసిన ఆ కంపెనీ వాడెంత మంచివాడండీ! ఇకనుండి ఊరగాయలు పెట్టేటప్పుడు, వంట చేసేటప్పుడు ఏవైనా డౌట్లొస్తే అమ్మనడిగి తెలుసుకోవచ్చన్నమాట. మా వాళ్ళందరికీ ఫోన్లు చేసి ఎవరెవరికి ఈ కంపెనీ ఫోన్లున్నాయో కనుక్కుంటాను" ఉద్వేగంగా అన్నది సుందరి.

సెల్ ఫోను అందరికీ కనిపించేలా పట్టుకొని ఆఫీసులో అడుగుపెట్టాడు కామేశం. "మొత్తానికి నువ్వూ సెల్లువాడి వయ్యావన్నమాట" అన్నాడు పక్కసీటు ప్రసాదరావు.

"ఇంకాస్త ఖరీదు పెడితే కెమెరా సెల్ వచ్చేదిగా" అన్నాడొక కొలీగ్.

"పోన్లేవోయ్ ఓ ఏడాదిలో ప్రమోషనొస్తుందిగా అప్పుడు ఇంకా మంచిది కొనుక్కోవచ్చులే" కళ తగ్గిన కామేశం ముఖం చూసి అన్నాడు అచ్చిబాబు.

అందరూ కామేశాన్ని అభినందించి లంచ్ టైంలో చిన్న పార్టీ ఇప్పించుకున్నారు కామేశం చేత. వాళ్ళ కళ్ళలో కసితో కూడిన ఆనందమేదో కనిపిస్తోంది. ఊబిలో దిగిన వాడికి ఇంకొకడు కూడా ఊబిలో దిగితే తన బాధ సగం మర్చిపోతాడు. కామేశం సరిగ్గా గమనిస్తే అలాంటి భావమే కనిపించేదేమో అతడి మిత్రుల ముఖాల్లో!

"చూడు కామేశం ఈ ఫోన్లున్నాయ్ చూశావూ- రెండో పెళ్ళాంలా మొదట్లో థ్రిల్లింగ్‌గానే ఉంటాయి. వాటి మోహంలోపడితే జేబుఖాళీ చేసేవరకూ వదలవు. హేండిల్ విత్ కేర్" వయసులో పెద్దవాడూ, అనుభవజ్ఞుడూ అయిన దామోదరం హెచ్చరించాడు కామేశాన్ని.

ఆఫీసునుంచీ వచ్చి సోఫాలో కూర్చొని కాఫీ తాగుతూ రిలాక్సవుతున్నాడు కామేశం. సుందరి జాడ కనిపించక ఇల్లంతా తిరిగి పెరట్లోకొచ్చాడు. అక్కడ అటూ ఇటూ పచార్లు చేస్తూ ఎవరికో కథ చెబుతోంది సుందరి. అప్పటికి అరగంట నుంచీ ఏకధాటిగా మాట్లాడుతూనే ఉంది. గుండె గుభేలుమంది కామేశానికి. సుందరి ఎదురుగా నుంచొని ఆపమన్నట్లుగా

సైగచేశాడు. సుందరి అతడి సైగలని ఏమాత్రం ఖాతరు చెయ్యలేదు. కామేశం జుట్టు పీక్కున్నాడు. నుదురుకొట్టుకున్నాడు అయినా సుందరి వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వెయ్యలేకపోయాడు. ఆ కథాసుధ సెల్‌లో బాలెన్స్ జీరో అయి సెల్ మూగనోము పట్టేవరకూ సాగిపోయింది.

"నీకేమైనా బుద్ధుందా ఫోన్లలో కథలు చెప్పుకుంటారా ఎవరైనా" కోపంగా అన్నాడు.

"మా ఫ్రెండూ వాళ్ళ టి.వి. పాడైందట. తను మిస్సయిన సీరియల్స్ కథలన్నీ చెప్పమంటే చెబుతున్నాను. అయినా నేనేమైనా తెలివి తక్కువ దాన్ననుకున్నారా. రేపు మనం ఊరెళితే నేను చూడలేకపోయిన సీరియల్స్ కథలన్నీ అది చెప్తానంది" అన్నది సుందరి.

"ఆ కథలన్నీ వినకపోతే కొంపలు మునిగిపోతాయా- బిల్లు గురించి ఆలోచించవా" ఇంకా కోపం వస్తున్నా అంత కోపం ప్రదర్శించే సాహసం చేయలేక విసుగ్గా అన్నాడు కామేశం.

"అలా బిల్లు గురించి అస్తమానూ ఆలోచించే వాళ్ళు ఫోన్లు కొనుక్కోకూడదు" తనూ తగ్గలేదు సుందరి. వితండవాదం చేసే భార్యతో వాదించే ఓపిక లేక నీరసంగా వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు కామేశం.

మర్నాడు కామేశం ఆఫీసులో వర్క్ చేసుకుంటుండగా సుందరి ఫోన్జేసింది. తను గుమ్మడి వడియాలు పెట్టాలనుకుందనీ, ఆఫీసు దగ్గర్లోనే పెద్ద మార్కెట్టు ఉన్నది గనుక వచ్చేటప్పుడు మంచి గుమ్మడికాయ ఒకటి పట్రమ్మని చెప్పింది. మంచికాయ ఎలా ఎంచుకోవాలో గుర్తులు చెప్పి, పనిలోపని మినప్పప్పు కూడా పొట్టుది తీసుకు రమ్మనీ మర్చిపోవద్దనీ అర గంటసేపు ఫోన్లో బాదింది. సుందరి మాట్లాడ్డం ఆపగానే "పెద్దసారు పిలుస్తున్నారంటూ" వచ్చి చెప్పాడు అటెండరు.

ఎందుకో ఏమిటో అని భయపడుతూనే బాస్‌గారి కాబిన్‌లోకి అడుగుపెట్టాడు కామేశం.

"ఓసారి నీ సెల్ ఇవ్వు కామేశం- ఇంటికి అర్జెంటుగా ఫోన్జేసుకోవాలి" అన్నాడు బాస్.

'హమ్మయ్య అంతేకదా ఇంకా ఏ నేరం మోపి ఏం తిట్లు తిడతాడోనని భయపడి చచ్చాను' అనుకుంటూ సెల్ తీసి టేబుల్ మీద పెట్టి వినయంగా నుంచున్నాడు కామేశం.

"నువ్వెళ్ళి పన్చూసుకో. నీ సెల్లు పంపిస్తాలే" అన్నాడు బాసు. బతుకుజీవుడా అనుకుంటూ బైటపడ్డాడు కామేశం.


"ఏమిటీ బాను సెల్లడిగాడా" నవ్వాడు ప్రసాదరావు.

అవునన్నట్టుగా తలూపాడు కామేశం. "ఇంటికేదో అర్జెంట్ కాల్ చెయ్యాలిట"

అన్నాడు కామేశం.

"అలాగే అంటాడు. ఓ యాభై రూపాయలు బిల్లు చేసి గానీ వదలడు. ఆఫీసు అవర్స్‌లో ఎవరైనా ఐదు నిమిషాలకి మించి ఫోన్‌లో మాట్లాడితే వాళ్ళకి బాస్ గారు విధించే విచిత్రమైన శిక్ష ఇది. కొత్తగా అమల్లో పెట్టాడట" అన్నాడు ప్రసాదరావు.

అరగంట క్రింత తను సుందరితో ఫోన్లో మాట్లాడిన సంగతి గుర్తొచ్చింది కామేశానికి. ఏమిటో ఈ సెల్ కొన్న దగ్గర్నుంచీ అన్నీ దుశ్శకునాలే - తలపట్టుకున్నాడు. ఓ గంట పోయాక అటెండరు ఇచ్చిన సెల్‌లో బాలెన్స్ చూసి మనసులోనే ఏడ్చాడు కామేశం. ఎవరితో మాట్లాడినా ఆ మాటలన్నీ కరెన్సీ నోట్ల రూపాన్ని సంతరించుకున్నట్టు కనబడుతున్నాయి కామేశానికి.




* * *

ఆ రోజు ఆదివారం. తీరిగ్గా ఓ చేత్తో పేపరు పుచ్చుకొని 'సుందూ కాఫీ' అని అరిచాడు కామేశం. అలా నాలుగుసార్లు పిలిచి వంటింట్లోంచి రెస్పాన్సేమీ రాకపోయే సరికి "ఏమైంది దీనికి - వంటింట్లో స్పృహ తప్పిపడిపోయిందా ఏమిటి అనుకుంటూ వంటింట్లో కొచ్చాడు కామేశం. సెల్‌లో ఎప్పట్నించీ మాట్లాడుతోందో సుందరి - కామేశం వెళ్ళేసరికి ఫోన్లో సంభాషణ ఇలా కంటిన్యూ అవుతోంది. "అక్కడో మలుపుంది బాబాయ్‌గారు. మనం ఊహించని మలుపది. మృత్యుదేవత కోరలుసాచి నిలబడినట్టుండే ఆ మలుపు దగ్గరే ఎన్నో యాక్సిడెంట్లు జరుగుతాయి. 'విధి విలాసం' సీరియల్‌లో అలాంటి మలుపు దగ్గరే హీరోయిన్ రేఖకి యాక్సిడెంట్ చేయిస్తుంది అత్తగారు. రేఖ చచ్చిపోయిందేమోనని మేమంతా భయపడి చచ్చామనుకోండి. కానీ బాగా డబ్బున్న ఓ పుణ్యాత్ముడు రేఖని కాపాడాడు లెండి. ఆ తర్వాత ఓ కళ్యాణ మండపం- ఆ - ఆ అదే అదే. రేఖని చంపేసిన తరువాత తన కొడుక్కి ఆ కళ్యాణమండపంలోనే డబ్బున్న అమ్మాయితో పెళ్ళి చేయాలను

కుంటుంది రేఖ అత్తగారు. ఆ తర్వాత ఓ ఫ్లైఓవరౌ స్తుంది. దానిమీద నుంచే హీరోయిన్ తన అత్తగార్ని కిందకి తోసి చంపేస్తుంది. అది దాటాక..."

సుందరి చేతిలోంచీ సెల్ లాక్కుని కట్ చేశాడు కామేశం. "ఫోన్లో కథలు చెప్పొద్దని ఎన్నిసార్లు చెప్పాను. అయినా బుద్ధిలేదా నీకు" కోపంగా అన్నాడు.

"అది కాదండీ- అది కథ కాదు- అసలేమైందంటే.." ఏదో చెప్పబోతున్న సుందరిని వారించి "ఇంకేం మాట్లాడకు. మొగుడంటే బొత్తిగా లెక్కలేకుండా పోతోంది. నోరెత్తకుండా వెళ్ళి ముందు కాఫీ పట్రా" హుకుం జారీ చేసి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్ళి కుర్చీలో కూర్చొని పేపర్ చదవసాగాడు. ఓ గంట గడిచాక కాలింగ్ బెల్ మోగింది. కామేశమే వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా రొప్పుతూ నిలబడ్డాడు ఉగ్రనరసింహంలా ఉన్న నరసింహం మామయ్య.



"నువ్వా మావయ్యా - ఫోన్జేస్తే స్టేషన్‌కొచ్చేవాడినిగా ఏమిటలా రొప్పుతున్నావ్" మావయ్య చేతిలో బ్యాగు అందుకుంటూ అన్నాడు కామేశం.

"క్షేమంగా చేరారా బాబాయ్ గారూ..మా ఇంటికొచ్చేదారి చెప్పడం మధ్యలో ఆపేశాను. ఎలా ఇల్లు చేరతారో అని బెంగపెట్టుకున్నాను" అన్నది సుందరి.

"ఎలాగో అష్టకష్టాలు పడి చేరాలేమ్మా- అయినా నేను రావడం ఇష్టంలేకపోతే ఆ సంగతి ఫోన్లోనే చెప్పచ్చుగా- వెనక్కి తిరిగి అట్నించి అటే వెళ్ళిపోయే వాడిని మధ్యలో ఫోన్ కట్ చేశావెందుకు" అన్నాడు నరసింహం నిష్ఠూరంగా.

"అయ్యో! ఆ కట్ చేసింది నేను కాదు. బిల్లు పెరిగిపోతోందని ఆయన ఆ పని చేశారు" అన్నది సుందరి. కామేశానికి అంతా గందరగోళంగా ఉంది. ఏమిటిదంతా అంటూ భార్యవంక చూశాడు. "అసలు సంగతేంటంటే మా బాబాయ్ గారు మనూరు వచ్చి మన ఇంటి అడ్రస్ రాసిన కాయితం పోగొట్టుకున్నారట. మనకి ఫోన్జేసి ఇంటికొచ్చేదారి చెప్పమన్నారు. నేనేమో దారి గుర్తులు చెప్తుంటే మీరు ఫోన్ లాక్కున్నారు"

"మరి ఈ సంగతి అప్పుడే చెప్పచ్చుగా. ఏదో సీరియల్ కథలా చెప్తుంటే అదేదో కథ చెప్తున్నావనుకున్నాను"

"మీరేగా నేను అసలు సంగతి చెప్పబోతుంటే నోరెత్తద్దని వార్నింగిచ్చారు"

జుట్టు పీక్కోవాలన్న కోరిక బలవంతాన అణచుకొని లేని నవ్వు తెచ్చుకొని "నన్ను క్షమించు మామయ్యా..పొరపాటైపోయింది" అన్నాడు మావయ్య వంక తిరిగి.

"క్షమించేశాలేరా..ఇలాంటి అపార్థాలు మా యింట్లోనూ వస్తాయిలే" అన్నాడు నరసింహం.

★ ★ ★

లంచ్ అవర్‌లో ఒంటరిగా కూర్చున్న కామేశం దగ్గరకొచ్చాడు పురుషోత్తం.

అందరూ అతడిని పీనాసి పురుషోత్తం అంటారు. కానీ తనది పొదుపు అనీ దాన్ని పీనాసితనం అనుకూడదని వాదిస్తాడు పురుషోత్తం.

"ఏమిటి కామేశంగారూ మీరీమధ్య డల్‌గా కనిపిస్తున్నారు" అంటూ పలకరించాడు పురుషోత్తం.

పెరిగిపోతున్న ఫోన్ల బిల్లుల గురించి చెప్పి తన గోడు వెళ్ళబోసుకున్నాడు కామేశం. అంతా విన్న పురుషోత్తం ఓ నిట్టూర్పు విడిచాడు. "ఇదంతా అవగాహన లోపం కామేశం గారూ...సాంకేతికంగా మనం సాధించిన అభివృద్ధి మనకెన్నో సౌకర్యాలు కల్పించింది. ఆ సౌకర్యాలు మనం అనుభవించడంలో తప్పులేదు. దేని అవసరం ఎంతవరకో అంతవరకే దాన్ని ఉపయోగించాలి. అంటే ఆ వస్తువు అవసరం మీద మనకి అవగాహన ఉండాలి. ఫోన్ ఉందనుకోండి. దాన్ని సంక్షిప్తంగా మాట్లాడడానికే వాడాలి. బాగా వివరంగా విశదీకరించి చెప్పాలంటే అందుకు ఉత్తరాలున్నాయని మర్చిపోకూడదు. కారు గానీ, స్కూటర్ గానీ వాడేముందు చిన్న చిన్న దూరాలు నడిచి వెళ్ళేందుకు కాళ్ళున్నాయని గుర్తుంచుకోవాలి. పైగా అది వంటి కారోగ్యం కూడా కదా.. చల్లని వెన్నెల రాత్రిని అనుభవించే అవకాశమున్నప్పుడు ఏ.సి.ని మరిచిపోవడం మంచిదే కదా! తలుచుకుంటే అన్నీ మన చేతుల్లోనే ఉన్నాయ్. నాకు రెండు ఫోన్లున్నాయ్. కారుంది. కానీ నేను మీలాగా ఖర్చులెక్కువయ్యాయని బాధపడట్లేదే. ఆలోచిస్తే పొదుపుగా మారడమెలాగో మీకే తెలుస్తుంది" పురుషోత్తం సందేశంతో ఆలోచనలోపడ్డాడు కామేశం.

## బిపాషా బెల్లీడాన్స్

బిపాషా బసుకి ఈ ఏప్రిల్ నెలంతా ఖాళీ వచ్చిందిట. షూటింగ్‌లేవీ లేకపోయేసరికి ఈ టైమ్‌ని సద్వినియోగం చేయాలని 'బెల్లీ డాన్స్' నేర్చుకోవాలనుకుంటోంది. ఏదో ఓ డాన్స్‌ని నేర్చుకోవాలని చాలా కాలంగా అనుకుంటున్న బిపాషా-ఈసారి బెల్లీ డాన్స్‌ని బాగా నేర్చుకోడానికి రెడీ అవుతోందిట. అంతేకాదు, తనకి స్విమ్మింగ్ కూడా అంతగా రాదనీ, ఈ హాలిడేస్‌లో స్విమ్మింగ్ కూడా బాగా నేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నానని చెబుతోందీ నల్లపిల్ల.